డబ్బుతిమ్మాయిపల్లి అడవిలో నరికిన టేకు చెట్టు

తరలించడానికి సిద్ధంగా ఉన్న టేకు కర్రలు

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- అంతరించిపోతున్న అటవీ సంపద
- చోద్యం చూస్తున్న అధికారులు

కొడిమ్యాల, మార్చి 26: కొడిమ్యాల మండలం డబ్బుతిమ్మాయిపల్లి (బొజ్జపోతన ఆలయ సమీపంలో), సూరంపేట, గోవిందారం, దమ్మయ్యపేట, బొల్లెన్‌చెరువు, నల్లగొండ, హిమ్మత్‌రావుపేట, తదితర గ్రామాల్లో వందల ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. కాగా, అడవుల్లోని టేకు చెట్లను స్మగ్లర్లు నరికి రాత్రి సమయాల్లో మండలంలోని దుగోడ మిషన్ల వద్దకు తరలిస్తున్నారు. అక్కడ సైజ్‌ల వారీగా కట్ చేసి సోప సెట్లు, కుర్చీలు, డ్రెస్సింగ్ టేబుళ్లు, డెకొలం మంచాలు, ఇతర సామగ్రి తయారు చేసి వాహనాల్లో పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో రోజురోజుకూ అటవీ సంపద అంతరించిపోతున్నది. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి అటవీ సంపదను పరిరక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కలప అక్రమంగా తరలిస్తే చర్యలు

మండలంలోని అడవుల నుంచి టేకు కలప అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి రాలేదు. బీట్ ఆఫీసర్లతో గ్రామాల్లో తనిఖీలు చేపడుతం. అక్రమంగా కలప నిల్వ చేసినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటం. అడవుల సంరక్షణకు కృషి చేస్తాం.

-మొహినొద్దీన్, ఫారెస్టు రేంజ్ అధికారి, కొడిమ్యాల

ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

- నిర్ణీత గడువులోగా చెల్లిస్తే ఓటీఎస్ వర్తింపు
- ఆదేశాలు జారీ చేసిన మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ

మెట్‌పల్లి, మార్చి 26: మున్సిపాలిటీల్లో ఓటీఎస్ (వన్‌టైమ్ సెటిల్‌మెంట్) ద్వారా ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ కల్పిస్తూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి (ఎంఏయూడీ) శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకంతో ఆస్తి పన్ను బకాయి లేదా జరిమానాకు సంబంధించి చెల్లింపుదారులకు కాస్త ఉపశమనం కలిగినట్లైంది. ఆస్తి పన్ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పాటు గత పెండింగ్ బకాయిలు వందశాతం వసూలు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈనెల 31 వరకు బకాయిలతో సహా ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఈ రాయితీ వర్తించనుంది. ఇప్పటికే బకాయితో సహా పన్ను చెల్లించి ఉంటే వారికి వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులో సర్దుబాటు అవుతుంది. పురపాలక శాఖ పరిధిలోని అన్ని పట్టణాల్లో ఈ ఓటీఎస్ పథకం అమలు కానుంది.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం వివరాలు అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

- కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల రూరల్, మార్చి 26: ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఆక్రమణకు గురైన 90 ఎకరాల ప్రభుత్వ భూమిని బుధవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. సర్వే నంబర్ల వ్యూ పాయింట్స్ చెక్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నర్సింగాపూర్‌లోని సర్వే నంబర్ 251, 437లో గల 90 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేసినట్లు తెలిపారు. ఇందులో ఏర్పాటు చేసిన ఇటుకబట్టీలను 48 గంటల్లోగా తొలగించాలని ఆదేశించారు. లేని పక్షంలో ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ల్యాండ్ సర్వేయర్ విఠల్ పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకే 'నా ఆటో సురక్షితం'

- ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- ఎస్పీ అశోక్‌కుమార్

మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

మెట్‌పల్లి రూరల్, మార్చి 26: ప్రయాణికుల భద్రత కోసమే జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'నా ఆటో సురక్షితం' కార్యక్రమం చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. మండలంలోని వెల్లుల్ల శివారులో గల వీఆర్ఎం గార్డెన్స్‌లో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. 'నా ఆటో సురక్షితం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెట్‌పల్లి పట్టణంలోని 346 ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో నాలుగువేలకు పైగా ఆటోలు ఉండగా, ఇప్పటి వరకు 2,500కు పైగా ఆటోలకు క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం చేసినట్లు వెల్లడించారు. మిగతా ఆటోలకు కూడా త్వరలోనే స్టిక్కరింగ్ పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు, వృద్ధుల సురక్షిత ప్రయాణం, భద్రత కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు ఏదైనా సమస్య ఎదురైతే డ్రైవర్ సీటు వెనకాల ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే డ్రైవర్‌కు సంబంధించిన పూర్తి సమాచారం మొబైల్‌లో కనిపిస్తుందని, దీంతో పాటు అత్యవసర కాల్, అత్యవసర ఫిర్యాదు వస్తుందని పేర్కొన్నారు. సంబంధిత సమాచారం ఆధారంగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే వీలుంటుందన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. అనంతరం సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, ఆర్డీవో శ్రీనివాస్, మెట్‌పల్లి సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐలు కిరణ్‌కుమార్, రాజు, ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లతో జిల్లా సంక్షేమాధికారి నరేశ్

అంగన్‌వాడీలకు అవగాహన సదస్సు

జగిత్యాల, మార్చి 26: జగిత్యాలలో జిల్లా మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్ర బృందం సభ్యులు అంగన్‌వాడీ టీచర్లకు కెపాసిటీ బిల్డింగ్, మహిళల హక్కులు, లింగ సమానత్వం, ఆర్థిక అక్షరాస్యత, కమ్యూనిటీ మొబిలైజేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేశ్ మాట్లాడుతూ, మహిళా హక్కుల గురించి, మహిళా సాధికారత బృందం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ సెంటర్ యొక్క రివ్యూ తీసుకున్నారు. మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ అశ్విని మాట్లాడుతూ, మహిళల హక్కులు, లింగ సమానత్వం, లింగ వివక్షత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ మధు, బ్లాక్ కో-ఆర్డినేటర్ లక్ష్మణ్, జిల్లా మహిళా సాధికారత కేంద్ర బృందం, జెండర్ స్పెషలిస్టు స్వప్న, గౌతమి, అకౌంటెంట్ నరేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలి


ఆస్తి పన్ను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

కోరుట్ల, మార్చి 26: ఆస్తి పన్ను, ఎల్ఆర్ఎస్ ఫీజు వసూళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా పట్టణంలో ఆస్తి పన్ను వసూళ్ల పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 31లోగా వంద శాతం ఆస్తి పన్ను వసూళ్లు లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, టీపీవో ప్రవీణ్‌కుమార్, తదితరులున్నారు.

హుండీల లెక్కింపు

కొడిమ్యాల, మార్చి 26: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో 55 రోజులకు సంబంధించిన హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించినట్లు ఈవో శ్రీకాంతరావు తెలిపారు. 12 హుండీలను లెక్కించగా రూ. 1, 09,13,339 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. భక్తులు 109 విదేశీ కరెన్సీ నోట్లు హుండీలో వేసినట్లు తెలిపారు. మిశ్రమ వెండి, బంగారం తిరిగి బ్యాగ్‌లో భద్రపరిచి హుండీలో వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కరీంనగర్ సహాయ కమిషనర్ సుప్రియ, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్, అర్చకులు, శ్రీ లలిత సేవా ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పసుపు క్వింటాల్ @ రూ.12,888

మెట్‌పల్లి, మార్చి 26: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపు కొమ్ము (కాడి) క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.12,888, కనిష్ఠంగా రూ.9,111, పసుపు మండ (గోళ) గరిష్ఠంగా రూ. 12,001, కనిష్ఠంగా రూ.8,909, పసుపు చూర గరిష్ఠంగా రూ.11,614, కనిష్ఠంగా రూ.8,686 పలికింది. ఈ రోజు 1294 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు మార్కెట్‌లో 35416 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

సారంగాపూర్, మార్చి 26: బీర్‌పూర్‌లోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను బుధవారం దేవాదాయ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రాజేశ్, అసిస్టెంట్ స్థపతి వెంకటేశ్ పరిశీలించారు. నిర్మాణ పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, ఆలయ మాజీ చైర్మన్ నేరేళ్ల సుమన్ గౌడ్, అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్ చార్యులు, చిన్న మధుకుమార్, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం

మేడిపల్లి, మార్చి 26: భీమారం మండలం మన్నెగూడెం గ్రామంలో బుధవారం పద్మశాలీ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిరిపురం లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా కటుకం మురళి, ప్రధాన కార్యదర్శిగా గోనె శ్రీహరి, సహాయ కార్యదర్శిగా కొక్కుల శ్రీనివాస్, కోశాధికారిగా కొక్కుల సుదర్శన్, కార్యవర్గ సభ్యులుగా వడ్లకొండ మురళి, అందె గణేశం, గొడ్డుబర్ల నరహరి, కైరంకొండ తుక్కారాం, కటుకం మహేశ్, వడ్లకొండ రమేశ్, గుంటుక నందకిశోర్, రాచర్ల మహేశ్, హన్మాండ్ల వీరేశం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం సభ్యులు కైరంకొండ సత్యనారాయణ, దాసరి వెంకటి, కొక్కుల మురళి, హన్మాండ్ల వీరేశం, జక్కని గంగాధర్, అందె గణేశ్, కైరంకొండ రాజగంగారాం, కటుకం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

వెల్గటూర్, మార్చి 26: ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన అరిగెల వైశాలి జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ కరీంనగర్ అధ్యక్ష, కార్యదర్శులు వడ్లూరి రాజేందర్, జిట్టబోయిన శ్రీను తెలిపారు. వైశాలిని మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు, సాన యాదిరెడ్డి, ఎంఈవో రాంచంద్రం అభినందించారు.

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ మండల కమిటీ

సారంగాపూర్, మార్చి 26: తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కొండ ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. కాగా, మండలాధ్యక్షుడిగా ధర్మనాయక్ తండా మాజీ సర్పంచ్ భుక్యా సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సిగిరి రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా బాదనపల్లి గంగాధర్, భుక్యా తిరుపతి నాయక్, సహ కార్యదర్శిగా తోట జయశంకర్, కార్యవర్గ సభ్యుడిగా మల్లేశం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూరమల్ల సతీశ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మచ్చ పద్మ, జిల్లా కార్యదర్శి మ్యాకల జలెందర్, తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ టాలెంట్ టెస్ట్

జగిత్యాల, మార్చి 26: కామర్స్ విద్యార్థులకు అపారమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ పేర్కొన్నారు. జగిత్యాలలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు బుధవారం నిర్వహించిన కామర్స్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన వచ్చింది. సుమారు 200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద నరేశ్, రామకృష్ణ డిగ్రీ కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేశ్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్ జారీ

కోరుట్ల, మార్చి 26: పట్టణంలోని ప్రకాశం వీధి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నజీమొద్దీన్‌కు జిల్లా విద్యాధికారి రాము బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు మండల విద్యాధికారి గంగుల నరేశం తెలిపారు. విధుల్లో అధికారులకు తప్పుడు సమాచారం అందించి, తనకు సంబంధించిన వారు ఎవరూ లేరని డిక్లరేషన్ ఇచ్చి పరీక్ష కేంద్రంలో డ్యూటీ చేయడంపై జిల్లా విద్యాధికారి సంజాయిషీ నోటీస్ ఇచ్చారు. 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు. కాగా, పట్టణంలోని ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రంలో తన కూతురు పరీక్ష రాస్తుండగా అదే పాఠశాలలో నజీమొద్దీన్ ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహించారు. విషయం బయటకు పొక్కడంతో అధికారులు సదరు ఉపాధ్యాయుడిపై చర్యలకు ఉపక్రమించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మేడిపల్లి, మార్చి 26: బీమారం మండలం మన్నెగూడెం గ్రామంలో మల్లన్న, రేణుకా ఎల్లమ్మ, ప్రభు రాముడి ఆలయాల వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం స్థానిక నాయకులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తేలు నరేశ్, నర్సింగరావు, గుంట గంగరాజం, మహిపాల్‌రెడ్డి, వడ్ల గంగాధర్, హరీశ్, ఉమ్మడి రవి, యాదవ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కట్నం కోసం వేధించిన అత్తింటి వారిపై కేసు

కథలాపూర్, మార్చి 26: తాండ్రాల గ్రామానికి చెందిన ఎల్ల మౌనికను అదనంగా కట్నం తేవాలని వేధిస్తున్న భర్తతో పాటు అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. తాండ్రాల గ్రామానికి చెందిన ఎల్ల మౌనికకు కోరుట్ల పట్టణానికి చెందిన ఎల్ల నవీన్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. మౌనికను ఇటీవల అదనంగా రూ. 10 లక్షలు కట్నం తేవాలని భర్త నవీన్, అత్త లక్ష్మి, ఆడపడుచు జల వేధిస్తున్నారు. మౌనిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎల్ల నవీన్, ఎల్ల లక్ష్మి, ఎల్ల జలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కలెక్టర్

జగిత్యాల, మార్చి 26: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్‌ను బుధవారం సాయంత్రం కలెక్టర్ సత్యప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషన్ చైర్మన్, సభ్యులు జగిత్యాలలో గురువారం పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ వారికి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు.

ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి

కోరుట్ల రూరల్, మార్చి 26: ఆయిల్ పామ్ సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని మండల వ్యవసాయాధికారి నాగమణి పేర్కొన్నారు. మండలంలోని జోగన్‌పల్లి గ్రామంలో బుధవారం ఆమె ఆయిల్ పామ్ సాగు, ట్రైకోడెర్మా విరిడి యొక్క ఉపయోగాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, ఆయిల్ పామ్ మొక్కలను రాయితీపై రూ. 20కి ఒకటి చొప్పున ఇస్తున్నట్లు తెలిపారు. నాలుగేళ్ల వరకు ఆయిల్ పామ్ సాగులో అంతర పంటల సాగు నిర్వహణ ఖర్చు కూడా ఇస్తుందని పేర్కొన్నారు. 80 నుంచి 100 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు కూడా ఇస్తుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఉద్యానవన శాఖ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ ఫీల్డ్ ఆఫీసర్ రజినీ, రైతులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

VEHICLE FOR SALE

★ Vehicle for Sale Hyundai XCent Disel Model 2018 Vehicle No. TS02FG5814 Contcat: Indusind Bank . Cell: 8790545692
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

జగిత్యాల, మార్చి 26: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా జగిత్యాల సర్కిల్ పరిధిలో 115 కెపాసిటర్ బ్యాంక్‌లు పెట్టినట్లు ఎస్ఈ సాలియానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వోల్టేజీలో హెచ్చు తగ్గులు లేకుండా కెపాసిటర్ బ్యాంక్‌లు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు.

అల్ఫోర్స్ విద్యా సంస్థల వార్షికోత్సవం

విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి

జగిత్యాల, మార్చి 26: జగిత్యాలలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్, అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్ట్స్ విద్యా సంస్థల వార్షికోత్సవం బుధవారం 'ల్యూమినస్' పేరిట ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలతో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్త్రీనిధి ఆర్ఎంకు రాష్ట్ర స్థాయి పురస్కారం

జగిత్యాల రూరల్, మార్చి 26: హైదరాబాద్‌లో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లాకు చెందిన స్త్రీనిధి రీజినల్ మేనేజర్ రాంనారాయణ రాష్ట్రస్థాయి అవార్డును మంత్రి సీతక్క చేతుల మీదుగా అందుకున్నారు. మెట్‌పల్లి మండలానికి చెందిన అసిస్టెంట్ మేనేజర్ గంగజల కూడా అవార్డు అందుకున్నారు. ఆర్ఎం, అసిస్టెంట్ మేనేజర్‌కు డీఆర్డీవో రఘువరణ్, ఏపీడీ చరణ్‌దాస్, ఐకేపీ సీఈ దివ్య, ఎస్ఎన్ మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, ఏపీఎంలు, సీసీలు అభినందనలు తెలిపారు.

బాయిలర్ కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

కోరుట్ల, మార్చి 26: గ్రామీణ ప్రాంత రైతులు బాయిలర్ కోళ్ల పెంపకం చేపట్టి ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని పీవీ నరసింహరావు పశు వైద్య కళాశాలలో బుధవారం కోళ్ల శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన మహిళా రైతులకు 'బాయిలర్ కోళ్ల పెంపకంతో రైతులకు ఆర్థిక చేయూత' అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, కోళ్ల పరిశ్రమ గ్రామీణ ప్రాంతాల్లో అద్భుతమైన పురోగతిని సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్, పశు వైద్య కళాశాల అధ్యాపకులు దైద కృష్ణప్రసాద్, రాంబాబు, పరశురాములు, రవికాంత్, సురేశ్, కీర్తన, అనిత, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులతో కళాశాల అధ్యాపకులు, అధికారులు

పాఠాలు బోధిస్తుండగా ఉపాధ్యాయురాలికి గుండెపోటు

- దవాఖానకు తరలించగా మృతి

మల్యాల(కొడిమ్యాల), మార్చి 26: పాఠాలు బోధిస్తుండగా గుండెపోటు రావడంతో ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు మృతి చెందిన ఘటన బుధవారం మల్యాల మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు, పాఠశాల యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాలలోని వాగ్దేవి హైస్కూల్‌లో జగిత్యాలకు చెందిన అనురాధ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నది. బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చిన అనురాధకు మధ్యాహ్నం భోజన విరామం అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తుండగా చాతిలో తీవ్ర నొప్పి వచ్చింది. ముందుగా అల్నూర్ అనుకొని స్థానిక ఓ ప్రైవేట్ దవాఖానకు, అక్కడి నుంచి జగిత్యాలలోని ప్రైవేట్, ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సీపీఆర్ చేసినా ఫలితం లేకపోవడంతో అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. అనురాధకు ఏడాది క్రితం వివాహం కాగా, ఒక కొడుకు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

కోరుట్ల రూరల్, మార్చి 26: మండలంలోని నాగులపేట గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వోదెల రామకృష్ణ బుధవారం పరిశీలించారు. ఉపాధి పనుల కొలతలు సక్రమంగా చేపట్టాలని, కూలీల బ్యాంక్ ఖాతాల్లో ఎప్పటికప్పుడు డబ్బులు జమ చేయాలన్నారు. వేసవి దృష్ట్యా వోఆర్ఎస్, నీటి వసతి ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే నర్సరీని పరిశీలించి గ్రామానికి సరిపడా మొక్కలను అందుబాటులో ఉంచాలన్నారు. సీసీ రోడ్డు పనులను పరిశీలించి, పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ సుచరిత్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్, మార్చి 26: పోసానిపేట గ్రామంలో ఉపాధి హామీ పనులను బుధవారం అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్ పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులకు కూలీలు పెద్ద సంఖ్యలో వచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, ఏపీవో రాజేందర్, కార్యదర్శి సులోచన, నరేశ్ ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

జగిత్యాల, మార్చి 26: బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సభ్యులు వినతిపత్రం అందజేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన నిరంజన్ బృందాన్ని బీసీ సంక్షేమ సంఘం నాయకులు బుధవారం రా